హక్కుపత్రాలు ఇవ్వాలంటూ ధర్నా

బీర్కూర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్మించి కేటాయించిన రెండు పడక గదుల ఇళ్లకు హక్కుపత్రాలు ఇవ్వాలని శుక్రవారం బైరాపూర్ ప్రజలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు స్వరూప ఆధ్వర్యంలో తహసీల్దార్ లతకు వినతి పత్రం అందజేశారు. ఏడేళ్ల నుంచి రెండు పడక గదుల ఇళ్లల్లో నివసిస్తున్నా.. 150 మంది లబ్ధిదారులకు ఇప్పటి వరకు హక్కుపత్రాలు ఇవ్వలేదన్నారు.

పర్యాటక కేంద్రంగా లింగంపేట

లింగంపేట, న్యూస్‌టుడే: లింగంపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాగన్న బావి వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక కేజీబీవీ విద్యార్థినుల యోగా ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. మహిళా సంఘాల సభ్యులు చేసిన వివిధ రకాల పిండి వంటలను పాలనాధికారి రుచి చూశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఆర్డీవో ప్రభాకర్, జిల్లా పరిషత్ సీఈవో చందర్ నాయక్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేష్, ఏపీఎం శ్రీనివాస్, ఎంఈఓ షౌకత్, ఎంపీవో మలహరి, పంచాయతి కార్యదర్శి శ్రావణ్, ఇతర మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




మహిళా సంఘం సభ్యులు చేసిన పిండి వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ : కేజీబీవీ విద్యార్థుల యోగా ప్రదర్శన

కేసుల పరిష్కారమే లక్ష్యం

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం

ఈనాడుతో జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్

కక్షిదారులకు కాలయాపన లేకుండా, డబ్బుల భారం పడకుండా, రాజీ కుదుర్చుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్‌ను వేదికగా మార్చుకోవాలని జిల్లా న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్ ఆర్ వరప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, ఇప్పటి వరకు లోక్‌అదాలత్‌లలో కేసులను పరిష్కరించిన తీరును శుక్రవారం ఈనాడు నిర్వహించిన ముఖాముఖిలో ఆయన వెల్లడించారు. ఆ అంశాలు న్యాయమూర్తి మాటల్లోనే..

ముఖాముఖి

జిల్లా పరిధిలోని కోర్టుల్లో 13,500 వరకు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలల కిందట జిల్లాలో జరిగిన లోక్‌అదాలత్‌లో 10,064 కేసులను ఇరువర్గాలు రాజీకుదుర్చుకుని రావడంతో పరిష్కరించాం. నేడు(శనివారం) జరగనున్న లోక్‌అదాలత్‌లో సుమారు ఏడు వేల కేసులు పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కేసులు పరిష్కరించుకోవాలని ఎవరిపై ఎటువంటి ఒత్తిడి ఉండదు. సత్వరమే సమస్యలు పరిష్కరించాలనే సంకల్పంతోనే చేపడుతున్నాం. కామారెడ్డి జిల్లాకేంద్రంతో పాటు ఎల్లారెడ్డి, బాన్సువాడలలో జాతీయ లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నాం.

డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవలు

- **ఉచితంగా న్యాయ సహాయం..** జిల్లా న్యాయసేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో బడుగు బలహీనవర్గాలతో పాటు రూ.3 లక్షలలోపు వార్షికాదాయం కలిగిన ఓసీలకు సైతం ఉచితంగా న్యాయసహాయం అందుతుంది.
- **రైతులకు మేలు..** అన్నదాతల ఇక్కట్లు పరిష్కరించేందుకు అగ్రి లీగల్ ఎయిడ్‌ను ఏర్పాటు చేశాం. తొలుత మీడియేషన్ వాలంటీర్లను నియమించి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చాం. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలో ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మీడియేషన్ కేంద్రాన్ని ప్రారంభించాం. జిల్లావ్యాప్తంగా త్వరలోనే మీడియేషన్ కేంద్రాలను ప్రారంభించేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. సామాజిక సమస్యలపై తక్షణమే స్పందిస్తూ సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులను పరిష్కారానికి పురమాయిస్తున్నాం.



- **బాధితులకు అండగా..** పోక్సో కేసుల బాధితులకు భవిష్యత్ అవసరాల నిమిత్తం ఆర్థిక తోడ్పాటు అందించేందుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా నిలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు ఐదుగురు బాధితులకు రూ.40 లక్షల మేర సహాయం అందించి ఆదుకున్నాం.
- **బెయిల్ లభించినా..** జమానత్ దొరకని నిందితులకు ఉచిత న్యాయసేవలు అందిస్తూ విడుదలకు ఎల్ఏడీసీఎస్(లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం) కింద సహకారం అందిస్తున్నాం.

మూడు రకాల కేసులను లోక్‌అదాలత్‌లలో పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. సివిల్, బీఎన్ఎస్ చట్టాల ప్రకారం రాజీకుదుర్చుకునే వీలున్న క్రిమినల్, ఇతర కేసులు (ఉదా: డ్రంక్‌అండ్‌డ్రైవ్, సైబర్, ట్రాఫిక్, భూతగాదాలు, రోడ్డు ప్రమాదాలు, భార్యాభర్తల తగువులు) వంటివాటిని పరిష్కరించుకునే వీలుంటుంది.

- కేసు పరిష్కారమైన వెంటనే అవార్డుపత్రాన్ని జారీచేస్తాం. లోక్‌అదాలత్‌లో రాజీకుదుర్చుకుని పరిష్కరించుకున్న కేసులో పై కోర్టుకు వెళ్లి అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదు. దీంతో పాటు లోక్‌అదాలత్‌లో కేసు పరిష్కరించబడితే అప్పటి వరకు కోర్టుకు చెల్లించిన రుసుం తిరిగిస్తాం.

గుర్తింపు కార్డుతో రావాలి

- రాజీకుదుర్చుకుని కేసులు పరిష్కరించాలనుకునే కక్షిదారులు గుర్తింపు నిమిత్తం ఆధార్‌కార్డులను వెంట తీసుకురావాలి. న్యాయవాదులను నియమించుకుని వస్తే కేసుల గుర్తింపు సులువు అవుతుంది. లోక్‌అదాలత్‌లను గతంలో ఆరుసార్లు, ప్రస్తుతం ఏడాదికి నాలుగుసార్లు నిర్వహిస్తున్నాం.
- ఇటీవల సైబర్‌నేరాలు పెరిగిపోతున్నాయి. పోలీసుశాఖ తెచ్చిన సంస్కరణల కారణంగా పలు కేసుల్లో సైబర్‌నేరస్థులు కొల్లగొట్టిన నగదును మళ్లించిన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. బాధితులకు లోక్‌అదాలత్‌ల ద్వారా నగదును తిరిగి ఇప్పించేందుకు అవకాశం ఉంటుంది.

విద్యుత్తుశాఖలో బదిలీలకు పచ్చజెండా

జేఎల్ఎం నుంచి జేఏవో వరకు ● రెండేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారికి వర్తింపు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో బదిలీల ప్రకటన వెలువడింది. రెండేళ్లు ఒకే చోట పని చేసిన వారిని బదిలీ చేసేందుకు రంగం సిద్ధమైంది. అయితే మొత్తం క్యాడర్‌లో 50 శాతం మందిని మాత్రమే బదిలీ చేయనున్నారు. జేఎల్ఎం నుంచి జేఏవో, సబ్ ఇంజినీర్ స్థాయి ఉద్యోగులకు బదిలీలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత జాబితాను ఈ నెల 28(నేడు)న ప్రదర్శించి 30వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అక్టోబరు 4న ఉద్యోగుల నుంచి దరఖాస్తులు, అదే నెల 7న బదిలీ కానున్న ఉద్యోగుల తుది జాబితా వెల్లడిస్తారు. బదిలీ అయిన ఉద్యోగులు వచ్చే నెల 9న రిలీవై మరుసటి రోజు విధుల్లో చేరాలని షెడ్యూల్‌లో సూచించారు.

డివిజన్, సర్కిల్ స్థాయుల్లో..

విద్యుత్తు ఉద్యోగుల బదిలీ ప్రక్రియ డివిజన్ స్థాయిలో సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు చేపట్టనున్నారు. జేఎల్ఎం, లైన్ ఇన్‌స్పెక్టర్, ఏఎల్ఎం, లైన్‌మెన్, అటెండర్ స్థాయి ఉద్యోగుల బదిలీలు చేపడుతారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల డీఈల పరిధిలో ప్రక్రియ పూర్తి చేస్తారు. సర్కిల్ పరిధిలో ఎస్ఐఎల్, ఫోర్‌మెన్, ఎల్‌డీసీ, యూడీసీ, జేఏవో, సబ్ ఇంజినీర్ ఉద్యోగులకు బదిలీలు వర్తిస్తాయి. సర్కిల్ పరిధిలో జరిగే ప్రక్రియను ఎస్ఈ పర్యవేక్షిస్తారు.

పారదర్శకంగా జరిగేనా..?

గతంలో జరిగిన ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, ప్రస్తుతం అలా జరగకుండా చూడాలని ఉద్యోగులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొందరిని ఒకే సెక్షన్‌లో బదిలీ చేయడంతో పాటు డిప్యుటేషన్లు ఇచ్చారు. ప్రస్తుతం డిప్యుటేషన్లకు అవకాశం లేకున్నా చాలా మందిని నియమించారు. ఉద్యోగ సంఘాల నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వడానికి ప్రొటెక్షన్ ఉంటుంది. కొన్ని సంఘాల వారు గతంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రొటెక్షన్ తెచ్చుకున్నారు. దీంతో ప్రక్రియ పక్కదారి పడుతుందని ఉద్యోగ సంఘాల నాయకులే గతంలో ఆరోపణలు చేసుకున్నారు. భార్యాభర్తలు (స్పౌజ్) బదిలీలను ప్రత్యేకంగా చూస్తారు. అనారోగ్య కారణాలు, ప్రొటెక్షన్ కేసుల్లో మాత్రమే బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. ప్రస్తుతం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ఉద్యోగులు కోరుతున్నారు.



ఎల్లారెడ్డి : ప్రమాణ స్వీకారం చేసిన ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎంపీ సురేశ్ షెట్కార్ తదితరులు

పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి పదవులు వాటంతట అవే వస్తాయని ఇందుకు నిదర్శనం ఎల్లారెడ్డి, సదాశివనగర్, గాంధారి మార్కెట్ కమిటీల నియామకమే అని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌తో కలిసి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతులకు మెరుగైన సేవలందించి రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలవాలని సూచించారు. రానున్న రోజుల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు.. సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు రానున్నాయని, కష్టపడిన వారికి తప్పనిసరిగా న్యాయం చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా రజిత, వైస్ ఛైర్మన్‌గా రాజు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

సమస్యలకు బాధ్యులను చేయొద్దు

నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడే సమస్యలకు తమను బాధ్యులు చేయొద్దని సొసైటీ ఛైర్మన్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా పరిధిలోని ఐడీసీఎంఎస్ మహాజన సభ ఇందూరులోని ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ తారాచంద్‌నాయక్ అధ్యక్షత జరుగగా.. డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు సన్న రకాల కొనుగోళ్లలో ఇబ్బందులు తప్పవని చెప్పారు. సన్నాలను నిర్ధారించే బాధ్యత వ్యవసాయశాఖనే తీసుకోవాలన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపుపై చర్చించారు. రైతుల నుంచి ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా చూడాలని విన్నవించారు. అనంతరం ఐడీసీఎంఎస్ అర్ధ వార్షిక బడ్జెట్, నిధుల వినియోగంపై చర్చించారు. డీసీవో శ్రీనివాస్‌రావు, వైస్ ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 12.5 కోట్లతో యూనిట్ల మరమ్మతులు

నిజాంసాగర్, మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ ప్రాజెక్టు జలవిద్యుదుత్పత్తి కేంద్రం యూనిట్ల మరమ్మతు పనులను రూ.12.5 కోట్లతో చేపడుతున్నట్లు టీజెన్‌కో సివిల్ డైరెక్టర్ అజయ్ తెలిపారు. మహ్మద్‌నగర్ మండలంలోని హాసన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న జలవిద్యుదుత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 2022 నవంబరులో రెండు యూనిట్లు మరమ్మతులకు గురవడంతో జపాన్ నుంచి అవసరమైన సామగ్రిని తీసుకువచ్చి పనులు చేపడుతున్నామని చెప్పారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలోగా పూర్తిచేసి రెండు యూనిట్లను వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. కేంద్రం పరిధిలో 42 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ప్రస్తుతం కొంత మేర ఆక్రమణకు గురైందని, అధికారుల చేత సర్వే చేయించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వరదగేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సివిల్ సీఈ నారాయణ, ఎస్ఈ శ్రీధర్, ఈఈ పాండురంగారెడ్డి, అధికారులు రమేష్‌బాబు, శ్రీనివాస్, సురేష్, శ్రీకాంత్, రవి, నియంతరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జలవిద్యుదుత్పత్తి కేంద్రం నమూనాను పరిశీలిస్తున్న అజయ్

ఇందూరులో సినీ తారల సందడి



\- ఈనాడు, నిజామాబాద్ న్యూస్‌టుడే, ఖలీల్‌వాడి

సినీ హీరో రామ్, హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కార్యక్రమానికి శుక్రవారం హాజరై సందడి చేశారు. హలో.. నిజామాబాద్ అంటూ అభిమానులతో ప్రేమగా ముచ్చటించారు. స్టెప్పులు వేసి వారిలో జోష్ నింపారు. సినీ తారలను చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలొచ్చారు.

సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములను పట్టాగా మార్చిన కథనంపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సమగ్ర విచారణకు ఆదేశించారు. అక్రమంగా పట్టా పొందిన వైనంపై ఈనాడు ఆధారాలతో సహ శుక్రవారం 'కన్నేసి.. కాజేసి' అనే శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో జిల్లా పాలనాధికారి స్పందించారు. భిక్కనూరు తహసీల్దార్‌ను పిలిపించి వివరాలు ఆరా తీశారు. సర్వేనంబర్ 936లో నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీ)లు ఎవరు జారీ చేశారని ప్రశ్నించారు. రెండు రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేసి తనకు సమర్పించాలని ఆదేశించారు.

ఈనాడు కథనానికి స్పందన

అధికారులతో సమీక్ష

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో అత్యవసర మరమ్మతు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి తనకు సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పాఠశాలలు, వసతిగృహాల బాధ్యులు, పీఆర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

7 వరకు పూర్తి చేయండి

కామారెడ్డి కలెక్టరేట్: వర్షాలకు దెబ్బతిన్న పనులను వచ్చే నెల 7వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయాశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

లక్ష్యం 2030

కుక్క కాటు... ఇది మన గల్లీలో ఉండేది అనుకుంటున్నాం. విశ్వ సమస్య. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ కుక్కతో వ్యాప్తి చెందే రేబిస్‌తో మరణాలను 2030 నాటికి సున్నాకు తీసుకురావాలన్న లక్ష్యంగా పెట్టుకుంది. ఏటా సెప్టెంబరు 28న టీకా కనుగొన్న లూయీ పాయిశ్చర్ గుర్తుగా ప్రపంచ రేబిస్ నియంత్రణ దినోత్సవం నిర్వహిస్తారు. రేబిస్ టీకా ప్రాధాన్యంపై అవగాహన పెంచడానికి కార్యక్రమాలు నిర్వహిస్తారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోనూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సమస్య తీవ్రతను తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

● నేడు రేబిస్ నియంత్రణ దినోత్సవం




న్యూస్‌టుడే, బోధన్ పట్టణం



- ఉమ్మడి జిల్లాలో తీవ్రంగా సమస్య
- ఏటా పెరుగుతున్న కుక్క కాటు బాధితులు
- రేబిస్ మరణాలు శూన్యమే ధ్యేయంగా డబ్ల్యూహెచ్‌వో ముందుకు

భారత్‌లో 2021-23 మధ్య కుక్క కాటు కేసులు రెట్టింపయ్యాయి. దాదాపు 80 శాతం పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి.

● దేశంలో 2021లో గంటకు 195 మంది కుక్కకాటుకు గురైతే 2022లో 250, అదే 2023లో 350 మంది బాధితులయ్యారు. ● జాతీయ ఆరోగ్య మిషన్ కుక్కకాటు బాధితులకు వేసే రేబిస్ వ్యాక్సిన్ కోసం రూ. 99.77కోట్ల నిధులు కేటాయించిందట. గతంకంటే బడ్జెట్ పెంచింది. ● ప్రపంచంలో ఏటా 59 వేల మంది రేబిస్, కుక్కకాటుతో సంభవించే మరణాల్లో 36 శాతం మన దేశంలో ఉంటున్నాయట. వాటిలోనూ 40 శాతం 15 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. ● కుక్క కాటు గురైన వ్యక్తికి ఇచ్చే టీకాకు రూ. 5వేల వ్యయమవుతోందట. ● 2023లో దేశవ్యాప్తంగా 30.43 లక్షల కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ● మనుషుల్లో నమోదైన రేబిస్ కేసులు 99 శాతం కుక్కతోనే వ్యాప్తి చెందింది. ● ప్రతి పదిహేను నిమిషాలకు ప్రపంచంలో ఒకరు రేబిస్‌తో చనిపోతున్నారు. ● రేబిస్ సోకిన తరువాత చికిత్స లేదు. వ్యాధి సోకితే మరణం నమోదవుతుందని చెబుతున్నారు.

ఈ గణాంకాల తీవ్రత ఆధారంగానే రేబిస్ నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన పెంచుతున్నారు. ప్రజల్లోనూ అవగాహన పెరుగుతోంది. కుక్క, కోతి, పిల్లి కాటేసినా, గోటి గాయాలకూ రేబిస్ టీకా తీసుకుంటున్నారు. పెంపుడు శునకాలకైతే ముందే వేయిస్తున్నారు.

2030 నాటికి రేబిస్ మరణాలను సున్నాకు తీసుకురావాలన్నది డబ్ల్యూహెచ్‌వో లక్ష్యం. అందుకు 70 శాతం కుక్కలకు టీకాలిస్తే రేబిస్ వ్యాప్తి ఆగిపోతుందన్నది అంచనా. అందుకు అనుగుణంగానే ప్రభుత్వాలు శునకాలకు టీకాలు ఇవ్వాలన్న మార్గదర్శకాలున్నాయి. ఈ ప్రక్రియకు స్థానిక సవాళ్లున్నాయి. స్థానిక సంస్థలు వీధి కుక్కలను పట్టుకుని తీసుకొస్తే పశు సంవర్ధక శాఖ సిబ్బంది రేబిస్ టీకా వేస్తారు. వేల సంఖ్యలో ఉన్న కుక్కలను పట్టుకోవాలంటే స్థానిక సంస్థల్లోని సిబ్బంది పారిశుద్ధ్య వ్యవస్థను పక్కన పెట్టాల్సి ఉంటుంది. లేదంటే అదనపు కార్మికులను నియమించుకోవాలి. ఆర్థికంగా భారమైనది కావడంతో అమలు కావడంలేదు.

రెండు గంటలకొకరు...



నిజామాబాద్ జిల్లాలో మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే రెండు గంటలకు ఒకరు సగటున కుక్క కాటుకు గురయ్యారు. 2022లో మాత్రం గంటకు ఒకరు చొప్పున బాధితులున్నారు. 2023, 2024లో మాత్రం రెండు గంటలకు ఒకరు చొప్పున బాధితులయ్యారు.

సంవత్సరం	నిజామాబాద్	కామారెడ్డి
2022	8878	896
2023	4416	756
09/2024	2820	331

ఉమ్మడి జిల్లాలో...

రేబిస్‌తో మరణాలు సంభవించిన దాఖలాలు లేవు. కుక్క కాటు గాయాలతో చనిపోయిన వారున్నారు. ఇందల్వాయికి చెందిన బాలుడు హైదరాబాద్‌లో శునకాల దాడిలో మృత్యు వాత పడ్డాడు. బోధన్ పట్టణంలో ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మరణించాడు. ఇలా అడపాదడపా శునకాల దాడిలో తీవ్ర గాయాల పాలై ప్రాణాలు కోల్పోతున్నారు. పెంపుడు, వీధి శునకమేది కరిచినా ప్రజలు తక్షణమే ఆస్పత్రికి వెళ్లి టీకా తీసుకోవడం శుభ పరిణామం.

అవగాహన కల్పిస్తున్నాం



రేబిస్ వ్యాధి నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నాం. పశువులను కుక్కలు కాటేసినా రేబిస్ టీకా ఇప్పించాలని సూచిస్తున్నాం. కుక్కల్లో వ్యాధి లక్షణాలు గుర్తించి జాగ్రత్తగా ఉండాలి. ప్రజల్లో అవగాహన పెరిగింది. వ్యాధి రాకుండానే జాగ్రత్తలు తీసుకోవడం మేలు. - **డాక్టర్ రోహిత్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ, బోధన్**

లింగ నిర్ధారణ కేసులో..

పోలీసుల అదుపులో ప్రభుత్వ వైద్యుడు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: లింగ నిర్ధారణ కేసులో గాంధారి సీహెచ్‌సీలో ప్రభుత్వ వైద్యుడిగా పనిచేస్తున్న ప్రవీన్‌ను మహారాష్ట్ర పోలీసులు శుక్రవారం తీసుకెళ్లినట్లు కామారెడ్డి పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కొద్దిరోజుల కిందట మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా ఉద్గిర్ తాలూకా కేంద్రానికి చెందిన ఓ గర్భిణి లింగ నిర్ధారణ పరీక్షల కోసం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చింది. లింగనిర్ధారణ చేసిన వైద్యుడు గర్భంలో ఆడబిడ్డ ఉందని చెప్పడంతో.. ఉద్గిర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భవిచ్ఛిత్తి చేయించుకుంది. విషయం తెలుసుకున్న అక్కడి వైద్య సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడి ఆసుపత్రిపై ఉద్గిర్ గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అక్కడి ఆసుపత్రి నిర్వాహకులను పోలీసులు విచారించగా. . గాంధారిలో పనిచేసే ప్రభుత్వ వైద్యుడు ప్రవీన్ పేరు చెప్పారు. గర్భవిచ్ఛిత్తికి కారణమంటూ ప్రవీన్‌ను తీసుకెళ్లేందుకు కామారెడ్డికి వచ్చిన మహారాష్ట్ర పోలీసులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ప్రవీన్‌ను మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా ఉద్గిర్ గ్రామీణ పోలీసు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. గతంలోనూ ఇదే వైద్యుడిపై కామారెడ్డి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న బృందం

క్రీడల్లో సత్తా చాటాలి

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: యువకులు క్రీడల్లో సత్తా చాటి జిల్లాకు పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆశిష్‌సాంగ్వాన్ ఆకాంక్షించారు. కామారెడ్డి కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో ఆయన మాట్లాడారు. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ఎదగాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శన ఆకట్టుకుంది. జిల్లాస్థాయిలో వివిధ అంశాల్లో యువత వారి ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఈవో రాజు, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో అనర్థం

☛ మున్సిపాలిటీల్లో స్పందిస్తేనే స్వచ్ఛత
☛ యంత్రాల వినియోగంలో అలసత్వం

నగర, పురపాలికల్లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంటితో పాటు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేరు చేసే యంత్రాలు ఏర్పాటుచేశారు. రూ.లక్షలు వెచ్చించి వీటిని ఏర్పాటు చేసినా లక్ష్యం నెరవేరడం లేదు. వీటిని సద్వినియోగం చేసుకోవడంలో యంత్రాంగం అలసత్వం ప్రదర్శిస్తోంది. పురపాలికల్లో పరిస్థితిపై కథనం.

పరిశీలన

● జనాభా ★ గృహాలు ◆◆ సెప్టిక్ ట్యాంకులు ☛ సమస్య

సమస్యకు శాశ్వత పరిష్కారం

● 3.90 లక్షలు ★ 84,750 ◆◆ 65 వేలు
☛ నిజామాబాద్ నగరంలో సెప్టిక్ ట్యాంకు నిండితే మలం సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.



అక్కడ శుద్ధీకరణ ప్లాంటును 2023లో ఏర్పాటు చేశారు. దీనికి నిత్యం 230 నుంచి 250 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయి. ఇక్కడ యంత్రంలో చెత్త వేస్తే ప్లాస్టిక్, కంపోస్టును, మట్టిగాను వేరుచేస్తోంది. నిత్యం సుమారు 200 టన్నుల చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు పంపిస్తున్నామని, ప్రక్రియ సాగుతోందని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు.
- న్యూస్‌టుడే, నిజామాబాద్ నగరం

విద్యుత్తు సరఫరా లేదు

● 90వేలకి పైగా ★ 22188 ◆◆ 22188
☛ ఆర్మూర్‌లో శుద్ధీకరణ ప్లాంటు పనులు 2021లో ప్రారంభించి 2024లో పూర్తి చేశారు. విద్యుత్తు సరఫరా లేక ప్రారంభానికి నోచుకోలేదు. ప్రైవేటు వ్యక్తులు మలం సేకరించి నిర్మానుష్య ప్రాంతాల్లో గుంతలు తీసి పడేస్తున్నారు. ప్లాంటుకు విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని పుర కమిషనర్ రాజు తెలిపారు.
- న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

లక్ష్యం అధిగమించడంలో నిర్లక్ష్యం

● 100436 ★ 26,346 ◆◆ 16,150
☛ కామారెడ్డి శివారులోని సిరిసిల్లరోడ్డు, పాతరాజంపేట, క్యాసంపల్లి వద్ద వ్యర్థాలు పారేస్తున్నారు. 2022లో మానవ వ్యర్థాల శుద్ధీకరణ కోసం ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీనికి నెలకు 5 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న పది వాహనాలు మాత్రమే వస్తున్నాయి. గతంలో రెండుసార్లు మల సేకరణ చేసే వాహన యజమానులకు పురపాలకశాఖ నోటీసులిచ్చినా పరిస్థితిలో మార్పులేదు. అవసరం ఉన్న వారు మాత్రమే వ్యర్థాల సేకరణ వాహనదారులను సంప్రదిస్తున్నారు. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు చర్యలు చేపడతామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ అన్నారు.
- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం



నిర్మించి అప్పగించలేదు

● 86,000 ★ 21,000 ◆◆ 15,120
☛ బోధన్ పట్టణ శివారుల్లో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు పడేస్తున్నారు. పట్టణంలోని డంపింగ్‌యార్డులో మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంటు 2021లో మంజూరు చేశారు. సంబంధిత ఏజెన్సీ నిర్మించినా ఇంకా అందుబాటులోకి రాలేదు. దీనిని ఇంకా తమకు అప్పగించలేదని పుర కమిషనర్ వెంకటనారాయణ అన్నారు.
- న్యూస్‌టుడే, బోధన్ పట్టణం



బోధన్‌లో నిర్మించి వదిలేసిన మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంటు

కేంద్రం ఊసే లేదు

● 22,000 ★ 5,342 ◆◆ 1011
☛ ఎల్లారెడ్డిలో ఇప్పటివరకు మానవ వ్యర్థాల శుద్ధీకరణ ప్లాంట్ ఏర్పాటు కాలేదు. చెత్త వేరు చేసే యంత్రాలు లేవు. సేకరించిన 20 మెట్రిక్ టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అందులో 5 మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయి. యంత్రాలు మంజూరైతే స్వచ్ఛ సేవలు అందిస్తామని పుర అధికారులు చెబుతున్నారు.
- న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి



రోడ్ల వెంటే..

● 25,600 ★ 4,700 ◆◆ 3,783
☛ భీమ్‌గల్ పురపాలికలో మానవ వ్యర్థాల శుద్ధీకరణ జరగడం లేదు. ప్రైవేటు వాహనాల్లో సేకరించి రోడ్లు, గుట్టల వెంబడి, బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు. 'గతంలో తడి, పొడి చెత్తను వేరు చేసే యంత్రం మంజూరైనా.. అది మధ్యలో ఆగి పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం చెత్తను అడ్డగుట్ట వద్ద ఉన్న డంపింగ్‌యార్డు ప్రతిపాదిత స్థలానికి తరలిస్తున్నాం.' అని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ అన్నారు.
- న్యూస్‌టుడే, భీమ్‌గల్

చదును చేసి.. వదిలేసి

● 30,326 ★ 9532 ◆◆ 9024
☛ బాన్సువాడ శివారుల్లో వ్యర్థాలు పారేస్తున్నారు. శుద్ధీకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తామంటూ నాలుగేళ్లుగా చెబుతున్నా అడుగు ముందుకు పడడం లేదు. డంపింగ్‌యార్డు స్థలంలో మొరం వేసి చదును చేశారు. నియంత్రణను ఏర్పాటు చేయాలి. అయినా ఫలితం లేదు. సంబంధిత సంస్థ ప్రతినిధులు రాగానే కేంద్రం పనులు మొదలు పెడతామని ఏఈ శ్రీకాంత్, పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు అన్నారు. త్వరలోనే ఎఫ్‌ఎస్‌టీపీ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం



నిర్మించాల్సిన ప్రదేశంలో మొరం వేసి వదిలేశారిలా....



జ్యోతి వెలిగిస్తున్న ఎంపీ అర్వింద్, చిత్రంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మేయర్ నీతూకిరణ్ తదితరులు

వస్త్ర దుకాణం ప్రారంభం

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: నగరంలోని హైదరాబాద్ రోడ్డు(పులాంగ్‌చౌరస్తా)లో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను శుక్రవారం ఎంపీ అర్వింద్ ప్రారంభించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూకిరణ్‌తో కలిసి జ్యోతి వెలిగించారు. ఈ కార్యక్రమానికి సినీ హీరో రామ్ పోతినేని, హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ హాజరై సందడి చేశారు. షాపింగ్‌లో తిరిగి వస్త్రాలు తిలకించారు. నూతన మోడళ్లను అందుబాటులో ఉంచినందుకు షోరూం నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. పిల్లలు, యువత, మహిళలు, పురుషులకు సంబంధించిన అన్ని రకాల వస్త్రాలు అందుబాటులో ఉంచినట్లు సీఎంఆర్ ఛైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్ మోహన్ బాలాజీ పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, భాజపా నాయకులు పల్లె గంగారెడ్డి, బస్వాలక్ష్మీ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండారం గువ్వలు.. సాహితీ మల్లెలు

● రచనల్లో సర్కారు బడి పిల్లల ప్రతిభ

న్యూస్‌టుడే, నిజామాబాద్ గ్రామీణం

చిరుప్రాయాలు అద్భుతాలు చేస్తున్నాయి. తెలుగు భాషపై పట్టుసాధించి మంచి కవితలు రాస్తున్నాయి. పద్యాలు అల్లుతున్నాయి. పద్య శతకాలు, కవితా సంపుటులు ఆవిష్కరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాయి. అవార్డులు అందుకుంటున్నాయి. గ్రామీణ మండలం గుండారం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు ఉపాధ్యాయుడు, కవి కాసర్ల నరేష్‌రావు శిక్షణలో రచనల్లో ప్రతిభ చాటుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మనోగతంపై 'న్యూస్‌టుడే' కథనం.

గురువు మార్గదర్శనంతో..

- ఆర్.లాస్య, పదో తరగతి

తెలుగు భాష, సాహిత్యం అంటే చాలా ఇష్టం. ఇప్పటివరకు 60 కవితలు, 10 కథలు రాశా. జిల్లాస్థాయి కథల పోటీల్లో విజేతగా నిలిచా. అంతర్జాతీయ స్థాయి కవితల పోటీల్లో గెలుపొందా. తెలుగు పండితుడు నరేష్‌రావు మార్గదర్శనంలో రాణిస్తున్నా.

ఆనందంగా ఉంది..

- ఏ.కృష్ణవేణి, పదో తరగతి

నేను ఇప్పటివరకు 50 కవితలు రాశా. సైన్సు ఫిక్షన్ కథలు 10 ఉన్నాయి. జిల్లా నుంచి అంతర్జాతీయస్థాయి వరకు బహుమతులు గెలుచుకోవడం ఆనందంగా ఉంది.

పుస్తకం తేవడమే లక్ష్యం

- అశ్విని, 8వ తరగతి

వందకు పైగా పద్యాలు ధారణ చేశా. ఆరో తరగతి నుంచి ఇప్పటి వరకు 40 కవితలు రాశా. కవితా సంపుటి తీసుకురావడమే నా లక్ష్యం.

అవార్డుల పంట..

● 2018లో 'గుండారం గువ్వలు' కవితా సంకలనాన్ని తీసుకొచ్చారు. ● ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్న విద్యార్థి పూజశ్రీ జిల్లాలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ● జిల్లాస్థాయి బాల కవి సమ్మేళనంలో 30 మంది పాల్గొని పాలనాధికారి నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ● సైన్సు ఫిక్షన్ బాలల జాతీయస్థాయి కథారచన పోటీల్లో ప్రథమ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులను గెలుచుకున్నారు. ● అంతర్జాతీయంగా ప్రచురితమయ్యే బాలల మాసపత్రిక 'గడుగ్గాయి' నిర్వహించిన కవితా రచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలతోపాటు నాలుగు బహుమతులు అందుకున్నారు.

● టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన రామాయణ, మహాభారత కథల పోటీల్లో ప్రథమ, తృతీయంతో పాటు ఆరు బహుమతులను సొంతం చేసుకున్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

మరిన్ని రాస్తా..

- శ్రుతి రెడ్డి, 9వ తరగతి

ఏడో తరగతి నుంచి కథలు రాస్తున్నా. గడుగ్గాయి మాసపత్రిక అంతర్జాతీయ కవితా పోటీల్లో, ఓటు విలువ పోటీల్లో జిల్లాస్థాయిలోనూ విజేతగా నిలిచా. 30 కవితలు రాశా. మరిన్ని రాస్తా.

కాసర్ల కృషి మరువలేనిది

- అమర్‌నాథ్, గుండారం జడ్పీహెచ్‌ఎస్, ప్రధానోపాధ్యాయుడు



ఇది వరకు ఇక్కడ పనిచేసిన తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేష్‌రావు విద్యార్థుల ప్రతిభను వెలికితీశారు. ఆయన కృషితోనే విజయాలు సాధ్యమయ్యాయి. ఆయన నేర్పిన స్ఫూర్తిని కొనసాగిస్తున్నాం.

నిర్వహణ లేక.. నీటికి అడ్డుగా..

ఈ చిత్రంలో కనిపిస్తుంది జుక్కల్, బిచ్కుంద మండలాల్లోని వందల ఎకరాలకు నీరందించే కౌలాస్ ప్రాజెక్టు కాల్వ. ఇందులో గడ్డి, తుంగ పేరుకుపోయి చివరి ఆయకట్టు వరకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. కాల్వ అక్కడక్కడ దెబ్బతినడంతో నీరు వృథాగా పోతోందని, పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందన కొరవడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. కాల్వలోని తుంగ, గడ్డితోపాటు పేరుకుపోయిన పూడిక తొలగించి మరమ్మతులు చేపట్టాలని, చివరి ఆయకట్టు వరకు నీరందించాలని కోరుతున్నారు.

– ఈనాడు, నిజామాబాద్, న్యూస్‌టుడే, జుక్కల్



ప్రమాదకరంగా వంతెనలు



ఎత్తుపల్లంగా ఉన్న వంతెనపై నుంచి వెళ్తున్న వాహనదారు

దోమకొండ-ముత్యంపేట రోడ్డులో నిర్మించిన వారధులు ప్రమాదాలకు హేతువులుగా మారుతున్నాయి. దోమకొండ నుంచి క్యాసంపల్లి వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఐదు వంతెనలు నిర్మించారు. వీటిని బాగానే నిర్మించినా.. రోడ్డుకు సమాంతరంగా మొరం లేకపోవటంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. తారు పనులు పూర్తి కావడంలో ఆలస్యం కారణంగా వారధి, రోడ్డు ఎత్తు పల్లాలుగా మారింది. వేగంగా వస్తున్న ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చొరవ చూపి వంతెనల వద్ద మొరం చదును చేయించి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, దోమకొండ

కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు మిగులు జలాల విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి చేరుతున్న వరద శుక్రవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టిందని ప్రాజెక్టు ఏఈఈ కొత్త రవి తెలిపారు. ఉదయం ఆరు గంటలకు 90,470 క్యూసెక్కులు రాగా, 20 గేట్ల ద్వారా 62,480 క్యూసెక్కులు నదిలోకి విడుదల చేశారు. సాయంత్రానికి వరద 40,586 క్యూసెక్కులకు తగ్గడంతో నాలుగు గేట్లు మూసి.. 16 గేట్ల ద్వారా 12,496 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో 1091 అడుగుల వరకు నీటిమట్టం ఉంది. 80.501 టీఎంసీల నిల్వ ఉంది. వరద కాల్వ ద్వారా 19000, కాకతీయ కాల్వ ద్వారా 6800, ఎస్కేప్ గేట్ల నుంచి 1200, లక్ష్మి కాల్వ ద్వారా 150, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

పూర్తి స్థాయిలో విద్యుదుత్పత్తి.. జల విద్యుత్తు ఉత్పత్తి ఆశాజనకంగా ఉందని డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఒకటో టర్బయిన్‌తో తొమ్మిది, రెండో టర్బయిన్‌తో 9.10, మూడో టర్బయిన్ ద్వారా 9.05, నాల్గో టర్బయిన్ ద్వారా తొమ్మిది మెగావాట్ల చొప్పున విద్యుత్తు ఉత్పత్తి జరుగుతుందని పేర్కొన్నారు.

వచ్చేది 21,500 .. వెళ్లేది 24,500 క్యూసెక్కులు

నిజాంసాగర్, మహ్మద్‌నగర్, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలో కురిసిన వర్షాలకు సాగర్‌లోకి భారీగా వరద వచ్చి చేరుతోందని జలవనరుల శాఖ ఏఈఈ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి ఎగువ ప్రాంతాల నుంచి జలాశయంలోకి 21,500 క్యూసెక్కుల జలాలు చేరడంతో మూడు గేట్లను ఎత్తి 24,500 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.802 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1404.98 అడుగులు (17.773 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

రైల్వే ప్రగతి పనుల పరిశీలన

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రంలో అమృత భారత్ కింద ఎంపికైన రైల్వేస్టేషన్‌లో రూ.39 కోట్లతో జరుగుతున్న ప్రగతి పనులను దక్షిణమధ్య రైల్వే బోర్డు సభ్యుడు జనార్దన్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఫుట్ బ్రిడ్జి, ఎస్కులేటర్ల ఏర్పాటు, ఇతర ఆధునికీకరణ పనులను ఆయన పరిశీలించి ప్రస్తుత స్థితిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేసేలా శ్రద్ధ చూపాలన్నారు.

పొదల తొలగింపు



కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాత కలెక్టరేట్ సమీపంలోని ప్రధాన రోడ్డుపైకి పొదలు వస్తుండడంతో ఈ నెల 22వ తేదీన 'పొదలు తొలగించరూ' శీర్షికన ఈనాడులో వార్త ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు రోడ్డుకు అడ్డుగా వచ్చే పొదలను ట్రాక్టర్ సాయంతో తొలగించారు..



తహసీల్దారు మెమో ఇవ్వడం సరికాదు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: వైద్యాధికారికి తహసీల్దారు మెమో ఇవ్వడం సరికాదని వైద్యవిధానపరిషత్ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎం శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జుక్కల్‌లో వైద్యాధికారికి మెమో ఏ ప్రాతిపదికన ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌వో, కలెక్టర్‌కు మాత్రమే మెమో ఇచ్చే అధికారం ఉందన్నారు. ఈ విషయంలో అధికారులు ఆలోచించాలన్నారు.

'పురపాలక ఛైర్‌పర్సన్‌పై చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు బడిలో సామరస్యంగా చర్చలు జరుపుతున్న సందర్భంలో పురపాలక ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అక్కడికి చేరుకుని పరిస్థితి ఉద్రిక్తతకు కారణమయ్యారని ఆర్యక్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్‌రావు ఓ ప్రకటనలో ఆరోపించారు. రాజకీయం కోసం తన వెంట వచ్చిన అనుచరులను రెచ్చగొట్టి రాళ్ల దాడికి ఉసిగొల్పారన్నారు. ఇందులో సీఐ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు పలువురు పోలీసులకు గాయాలయ్యాయన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరించిన ఛైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, చాట్ల వంశీ, పాత శివకృష్ణ, పిడుగు మమత, నాయకులు బెల్లపు గోపి, ఇమ్రాన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఛైర్‌పర్సన్ భర్త చంద్రశేఖర్‌రెడ్డి 15 రోజుల క్రితం భూకబ్జా కేసులో ఎదుటి వర్గంపై కేసు పెట్టించారన్నారు. పట్టణంలో అన్ని విషయాల్లో తలదూరుస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

'తప్పుడు ఆరోపణలు తగవు'

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి పురపాలక ఛైర్‌పర్సన్‌పై తప్పుడు ఆరోపణలు తగవని కౌన్సిలర్ చాట్ల వంశీ ఓ ప్రకటనలో తెలిపారు. మాజీ ఛైర్‌పర్సన్ జాహ్నవి తండ్రి, ఆర్యక్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్‌రావు కొందరు కౌన్సిలర్లపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఓ చిన్నారిపై జరిగిన ఘటనపై ఆడబిడ్డగా వారికి అండగా నిలిచేందుకు ఛైర్‌పర్సన్ అక్కడకు వెళ్లారన్నారు. సామరస్యంగా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశామన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇటీవల నిట్టు వేణుగోపాల్‌తో పాటు అతడి తమ్ముడు కృష్ణమోహన్‌ను భారాస సస్పెండ్ చేసిందన్నారు. రాజకీయ భవిష్యత్ అగమ్యగోచరంగా మారడంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విషయమై తగిన చర్యల నిమిత్తం పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

చదువులు గాడిన పడేనా...?

● విద్యార్థుల ఘర్షణలతో పరేషాన్

న్యూస్‌టుడే,ఎల్లారెడ్డి, సదాశివనగర్



ఎల్లారెడ్డి : బాలుర వసతిగృహంలో విద్యార్థుల ఘర్షణకు గల కారణాలు తెలుసుకుంటున్న పోలీసులు(పాతచిత్రం)

☛ సదాశివనగర్ ఆదర్శ పాఠశాలలో నెలరోజుల కిందట ప్రిన్సిపల్, ఉపాధ్యాయులకు మధ్య గొడవ జరిగింది. ఈ విషయం ఉన్నతాధికారులకు చేరడంతో డీఈవో ఆదేశాలతో ఎంఈవో విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. నివేదిక ఆధారంగా ప్రిన్సిపల్‌తో సహా మరో ఇద్దరు ఉపాధ్యాయులను పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై పంపించారు.

☛ సెప్టెంబర్ 5వ తేదీ రాత్రి ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సీనియర్ విద్యార్థులు కర్రలతో దాడులు చేసుకోవడంతో పలువురు గాయాల బారిన పడడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం చేయించారు.

☛ జుక్కల్‌లోని బీసీ బాలికల వసతిగృహంలో అర్ధరాత్రి ఆకలి వేసిందని పల్లీపట్టి ప్యాకెట్లు తీసుకున్న విద్యార్థినులను కొట్టి, వసతిగృహం నుంచి తరిమేశారని తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

కామారెడ్డి జిల్లాలో పలు పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు వివిధ సమస్యలతో సతమతమవుతున్నారు. సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక అరకొర వసతుల మధ్య చదువులు కొనసాగిస్తున్నారు. చాలా చోట్ల అపరిశుభ్ర వాతావరణంలో భోజనాలు చేస్తున్నారు.

గురుకులాలు, పాఠశాలలు	1257
విద్యార్థులు	1,46,415

బసతో మారేనా...?

జిల్లా కలెక్టర్లు నెలలో ఒక రోజు రాత్రి వసతి గృహాల్లో బస చేయాలని సీఎస్ శాంతికుమారి నుంచి ఆదేశాలు జారీ చేయడంతో మంచి రోజులు వస్తాయని విద్యార్థులు... తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ నెల 20వ తేదీన ఎల్లారెడ్డి బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పాలనాధికారి సాంగ్వాన్ బస చేశారు. విద్యార్థులతో కలిసి రాత్రిభోజనం... ఉదయం అల్పాహారం స్వీకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు.

దసరాకు రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే : దసరా పండగ రోజు పేదల ముఖంలో చిరునవ్వులు చూసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టనుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి హాజరై పాత్రికేయులతో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని నియోజకవర్గంలో ఇప్పటి వరకు 29,739మందికి రుణమాఫీ వర్తింపు జరిగిందని త్వరలోనే అందరికి మాఫీ జరిగేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఎల్లారెడ్డిలో ట్యాంకు బండ్, పార్క్, అమృత 2.0ద్వారా ప్రత్యేక నిధులు తీసుకొచ్చి బల్దియా ప్రగతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గాంధారి మండల కేంద్రంలో ఐదెకరాల్లో మినీస్టేడియం ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరికి పొట్ట కుళ్లు తెగుళ్లు

నిజాంసాగర్, మహ్మద్‌నగర్: వాతావరణంలో మార్పుల కారణంగా వరి పంటకు సుడిదోమ, పొట్ట కుళ్లు తెగుళ్లు సోకుతుందని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. మహ్మద్‌నగర్ మండలంలోని శేర్ఖాన్‌పల్లి గ్రామ శివారులోని పొలాలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి అమర్‌ప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పైమెట్రిజిన్ ఎకరానికి 120 గ్రాములు లేదా డైనోటెఫ్యూరాన్ 100 గ్రాములు, ప్రోపికొనజోల్ ఎకరానికి 200, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 50 గ్రాములు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వరిలో చీడపురుగులు, తెగుళ్ల వ్యాప్తి కనిపించినప్పుడు యూరియాను వాడవద్దని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి రేణుక, గ్రామ రైతులు పాల్గొన్నారు.



●●● పట్టణంలోని 15వ వార్డులో రోడ్డుపై మొరం, మట్టి నిల్వలతో దారిపై ప్రయాణించేందుకు ఇబ్బందులు తప్పడంలేదు. - **రాహుల్, స్థానికుడు**

●●● ఈ విషయమై పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందితో సమస్యను పరిష్కరించారు.

●●● జిల్లాకేంద్రంలోని అజంపురా వద్ద చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. చర్యలు తీసుకోవాలి. - **మల్లేశం, అజంపురా**



●●● సిబ్బందితో క్షేత్రస్థాయిలో యంత్రంతో చర్యలు చేపట్టాం.

- **పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**



బిచ్కుంద: రాంసాయి మందిరం వద్ద మురుగు కాల్వపై మూత లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నారని సచిన్ ఫిర్యాదు మేరకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ స్పందించి శుక్రవారం నాపరాళ్లను ఏర్పాటు చేశారు.

●●● జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌లో గోదావరి జలాలు సక్రమంగా రావడం లేదు.

- **ప్రసాద్, విద్యానగర్**

●●● మెరుగైన నీటి సరఫరాకు చర్యలు చేపడతాం. - **సుజాత, కమిషనర్**

●●● అన్నారం గ్రామంలో మురుగు కాలువలు తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడద తీవ్రంగా ఉంది.

- **లింగం, గ్రామస్థుడు.**

●●● మురుగు కాలువలను శుభ్రం చేసి, దోమల బెడద లేకుండా ఫాగింగ్ చేయిస్తాం. **సాగర్, పంచాయతీ కార్యదర్శి.**

●●● మండలంలో కొన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

- **శంకరయ్య, అరగొండ**

●●● పనిచేయని సీసీ కెమెరాలను గుర్తించి బాగు చేయిస్తాం. అంతటా వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- **పుష్పరాజు, ఎస్సై, రాజంపేట**

●●● బేగంపూర్‌లో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. **అంజవ్వ, బేగంపూర్.**

●●● సిబ్బందికి చెప్పి సమస్య పరిష్కరిస్తాం. **సాయినాథ్, ఏఈ, పెద్దకొడప్‌గల్.**

●●● బండాపల్లి తండాలో మురుగుకాల్వలు లేక నీరంతా రోడ్డు పక్కన పారుతోంది. **రాములు, స్థానికుడు**

●●● మురుగుకాల్వల నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. **సునీత, పంచాయతీ కార్యదర్శి, బండాపల్లి**

●●● జంగంపల్లిలో అక్రమంగా రెండు బెల్ట్ దుకాణాలు కొనసాగిస్తున్నారు. పల్లె దవాఖాన పక్కనే ఉన్న బెల్ట్ దుకాణంతో ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - **నరేష్, గ్రామస్థుడు.**

●●● సిబ్బందితో పరిశీలన చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తీసుకుంటాం. - **మధుసూదన్‌రావు, ఎక్సైజ్ సీఐ, దోమకొండ**

●●● ముత్యంపేటలోని 5వ వార్డులో వీధి దీపాలు వెలగడం లేదు. - **నరహరి, ముత్యంపేట, మం.దోమకొండ**

●●● వెలగని వాటి స్థానంలో కొత్తవి బిగిస్తాం. - **అంజయ్య, గ్రామ కార్యదర్శి, ముత్యంపేట**

- **న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం, పిట్లం, కామారెడ్డి పట్టణం, రాజంపేట ,రామారెడ్డి, పెద్దకొడప్‌గల్, దోమకొండ, భిక్కనూరు**

ఉద్యానం పరిశీలన

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మల్టీ జనరేషన్, చిల్డ్రన్స్ పార్కులను శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. పార్కులోని వసతులను పరిశీలించారు. ప్రజలతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట నాయకులు అంజిరెడ్డి, శ్రీధర్, రాజు, కిరణ్ తదితరులున్నారు.

డీటీవోను కలిసిన పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

కామారెడ్డి కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరి అధికారి(డీటీవో) వెంకటేశ్వర్లను పెన్షనర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యలను వివరించారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయ అధికారులనూ కలిశారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర సలహాదారు లచ్చయ్య, వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకరయ్య, ప్రధాన కార్యదర్శి విజయ రామరాజు, కార్యదర్శులు నర్సింహారెడ్డి, సత్తయ్య, రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. న్యాయం చేయండి

● మాచారెడ్డిలో బహిష్కరణకు గురైన కుటుంబాల ఆవేదన



అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు పత్రాలను చూపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

మాచారెడ్డి, న్యూస్‌టుడే: సంఘం పెద్దలతో తమకు ప్రాణహాని ఉందని మాచారెడ్డిలో ఐదు కుటుంబాలు శుక్రవారం విలేకరులతో గోడు వెల్లబోసుకున్నాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. . మాచారెడ్డి మండలకేంద్రంలో గౌడ కులానికి చెందిన అమ్మాయి మూడేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన దళిత అబ్బాయిని పెళ్లి చేసుకుంది. ఈ విషయంపై ఆగ్రహించిన గౌడ కుల సంఘం పెద్దలు ఆ అమ్మాయికి సంబంధించిన కుటుంబ సభ్యులను కులం నుంచి బహిష్కరించారు. మూడేళ్లుగా ఇలానే కొనసాగిస్తున్నారు. సంఘం పెద్దలను బతిమాలినా.. ససేమిరా అన్నారని, అంతటితో ఆగకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఆ ఐదు కుటుంబాలతో కులస్థులు ఎవరైనా మాట్లాడినా, మంచి చెడులకు పిలిచినా జరిమానా విధిస్తామని కుల సంఘ పెద్దలు తీర్మానించారని పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత తమకు వారసత్వంగా వస్తున్న ఆస్తులపై హక్కు లేదన్నట్లు వ్యవహరించారని బాధితులు వాపోయారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోలేదని, తమ ఆస్తులపై కూడా దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. తమను కులంలో కలుపుకొని మాచారెడ్డి గౌడ సంఘం ఆస్తుల్లో భాగస్వామ్యం కల్పించాలని కోరుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి న్యాయం చేయాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.



ప్రసంగిస్తున్న స్వామి శ్రీనరేంద్ర చార్యజీ మహారాజ్

హిందూ ధర్మం గొప్పది

జుక్కల్, న్యూస్‌టుడే: హిందూ ధర్మం సనాతనమైనది, గొప్పదని స్వామి శ్రీనరేంద్ర చార్యజీ మహరాజ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ ఉప పీఠానికి వచ్చిన ఆయన 'సమస్యా-మార్గదర్శనం, సాధక్ దీక్ష' కార్యక్రమాలతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 'మీరు మేల్కొండి.. ఇతరులను మేల్కొల్పండి' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ జాగృతం కావాలన్నారు. పర్యావరణాన్ని గౌరవించాలని, చెట్లను నాటి జీవితాన్ని పెంచుకొందామన్నారు. యువత భక్తి వైపు మొగ్గు చూపాలని, ధర్మ రక్షణకు పాటు పడాలని సూచించారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలొచ్చారు.



కామారెడ్డిలో టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో..



బీర్కూర్: బరంగెడ్గిలో..



పిట్లంలో



జిల్లాకేంద్రంలో.. జిల్లా పద్మశాలి, బీసీ సంక్షేమసంఘం శాఖల ఆధ్వర్యంలో..



బాపూజీ విగ్రహానికి నివాళులర్పించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఆయా పక్షాల ప్రతినిధులు

కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి



కామారెడ్డిలో.. భారాస నాయకులు

జిల్లావ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లోని విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు, కులసంఘాల సభ్యులు పాల్గొన్నారు. -**న్యూస్‌టుడే,బృందం**



ఎస్పీ సింధూశర్మ



బిచ్కుందలో..



బాన్సువాడలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రోస్ ఛైర్మన్ బాల్‌రాజ్



కామారెడ్డిలో.. ఛైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కమిషనర్ సుజాత



దోమకొండలో ..

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

సింగరాయపల్లి(రామారెడ్డి) పల్వంచ మండలం సింగరాయపల్లి ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడు సుదర్శన్ శుక్రవారం కంప్యూటర్, టైలను వితరణ చేశారు. మరో ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌రెడ్డి టేబుల్‌ను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్‌లో సుదీర్ఘకాలం అటెండర్‌గా విధులు నిర్వహించి కొవిడ్ సమయంలో మరణించిన గంగారాం కుటుంబ సభ్యులకు ప్రతినిధులు రూ. 23 వేల ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంజిరెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి వెంకటరమణ, హన్మంత్‌రావు, భూషణ్‌రెడ్డి తదితరులున్నారు.

యువతి పెళ్లికి ...

భిక్కనూరు, న్యూస్‌టుడే: కాచాపూర్‌లో పేదింటి కుటుంబానికి చెందిన యువతి పెళ్లికి షబ్బీర్‌అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రూ.5000 ఆర్థిక సాయం ఇచ్చారు. కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడు నర్సింగరావు, మాజీ ఎంపీపీ బైండ్ల సుదర్శన్, కిష్టాగౌడ్, రాజనర్సింహారెడ్డి, రాజాగౌడ్ పాల్గొన్నారు.

ధరణి ఆపరేటర్లకు వేతనాలు చెల్లించాలి

నాగిరెడ్డిపేట్: తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని ఆపరేటర్ రాజశేఖర్ నాయబ్ తహసీల్దార్ రాజేశ్వర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.

పురపాలిక స్వచ్ఛతకు కృషి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక స్వచ్ఛతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు పేర్కొన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవాలో భాగంగా విద్యార్థులతో పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు.

గోదాం పరిశీలన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని సివిల్ సప్లై గోదాంను శుక్రవారం ఆ శాఖ డీఎం రాజేందర్ పరిశీలించారు. ధాన్యం నిలువ, రికార్డులను పరిశీలించారు.

సబ్ కలెక్టర్‌కు వినతి

బాన్సువాడ పట్టణం: నిబంధనలు పాటించకుండా భవన నిర్మాణాలు చేపట్టిన వాటిపై చర్యలు తీసుకోవాలని భాజపా నాయకులు శుక్రవారం సబ్‌కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, ప్రసాద్, గంగారెడ్డి, సాయిరెడ్డి తదితరులున్నారు.

కామారెడ్డి సంక్షేమం, న్యూస్‌టేడే: రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి తండా, షేర్‌శంకర్ తండాల్లోని రోడ్ల సమస్యలను పరిష్కరించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

పిట్లం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ పిట్లం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

డ్వాక్రా మహిళలకు ఆర్థిక చేయూత

గాంధారి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 'ఇంద్ర మహిళ శక్తి పథకంలో భాగంగా పెరటి కోళ్ల పెంపకంతో డ్వాక్రా మహిళల ఆర్థిక చేయూతకు ప్రోత్సాహం అందిస్తోందని ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం గంగారాజు అన్నారు. బూర్గుల్ మార్గంలో రూ.2లక్షల రుణంతో జువ్వాడికి చెందిన లబ్ధిదారులు వడ్ల లక్ష్మికి చెందిన పెరటి కోళ్ల మదర్ యూనిట్‌ను శుక్రవారం ప్రారంభించారు. 40రోజులకు చెందిన కోడిపిల్లలను ఒక్కొక్క దానికి రూ.120 వ్యయం వెచ్చించి 1200 కోడిపిల్లలను అందజేశారు. ఈ మదర్ యూనిట్ ద్వారా ఒక్కో మహిళా సభ్యురాలికి 20 కోడిపిల్లలను అందించనున్నారు. వీటితో కుటుంబాలకు పౌష్టికాహారంతో పాటు స్వయం ఉపాధి దొరుకుతుందన్నారు. ఎంపీవో లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి అరుణ్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



పెరటి కోళ్ల యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాజేశ్వర్, ఏపీఎం గంగరాజు

కబడ్డీ పోటీలకు ఎంపిక

కామారెడ్డి గ్రామీణం, క్రీడావిభాగం, న్యూస్‌టుడే: కామారెడ్డి మండలం గర్గుల్‌లో శుక్రవారం కబడ్డీ అండర్ 14, 17 క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఎంపికైన క్రీడాకారులకు నేటి నుంచి(శనివారం) జిల్లాకేంద్రంలో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లోని బాలికలకు సరస్వతి శిశుమందిర్‌లో, బాలురకు ఫ్రోబెల్స్ పాఠశాలలలో సాయంత్రం 4 గంటల నుంచి శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు

కులవృత్తుల బలోపేతానికి కృషి

బాన్సువాడ పట్టణం, బాన్సువాడ, న్యూస్‌టుడే: కులవృత్తులపై ఆధారపడి జీవనం సాగించే వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం విశ్వబ్రాహ్మణ యువజన సంఘం కార్యవర్గ ప్రమాణస్వీకారానికి హాజరైన ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే గంగాధర్, నాయకులు కృష్ణారెడ్డి, భాస్కర్, సురేష్, ఎజాజ్, హకీం తదితరులున్నారు.

రక్షిత తాగునీరందించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ రాజేంద్రకుమార్

బీర్కూర్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు రక్షిత తాగునీరు సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఉమ్మడి జిల్లాల ఎస్ఈ రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. రైతునగర్‌లోని రైతువేదికలో శుక్రవారం బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని మంచి నీటి సహాయకులకు శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పైపులైన్లు లీకేజీ లేకుండా చూడాలని పేర్కొన్నారు. డీఈ వెంకటేశ్వర్ గౌడ్, ఏడీఏ అనిల్‌కుమార్, ఎంపీడీవో భారతి, ఏఈలు జగదీశ్, అశ్విని, ఎంపీవో మహబూబ్ తదితరులు ఉన్నారు.

భాజపాతో దేశాభివృద్ధి

రామారెడ్డి, న్యూస్‌టుడే: భాజపాతోనే దేశాభివృద్ధి చెందుతుందని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాణాల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం రామారెడ్డి, ఉప్పల్‌వాయి గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, భాజపా మండలాధ్యక్షుడు ఈశ్వర్, విఠల్, గడ్డం ప్రసాద్, గోపి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రామారెడ్డిలో సభ్యత్వ నమోదు చేస్తున్న భాజపా నాయకుడు లక్ష్మారెడ్డి

నవ వధువు బలవన్మరణం



వైష్ణవి

సిర్గాపూర్(కల్హేర్), న్యూస్‌టుడే: పెళ్లి ఇష్టంలేక జీవితంపై విరక్తి చెందిన నవ వధువు ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన నిజాంపేట్ మండలంలోని ఖానాపూర్‌లో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. కల్హేర్ ఎస్సై వెంకటేశం కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని మాదాపూర్‌కు చెందిన వైష్ణవి(21)కి నిజాంపేట మండలం ఖానాపూర్(బీ) గ్రామానికి చెందిన హన్మండ్లుతో ఆరు నెలల కిందట వివాహమైంది. తల్లిదండ్రులు ఇష్టంలేని పెళ్లి చేశారని వైష్ణవి తరచుగా బాధపడేది. ఇంట్లో ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉండేది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆమె గురువారం ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఘటనా స్థలాన్ని ఇన్‌ఛార్జి తహసీల్దార్ శివశ్రీనివాస్ సందర్శించి పంచనామా నిర్వహించారు. మృతురాలి తండ్రి బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాటుసారా, బెల్లం పట్టివేత

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: గంభీరావుపేట మండలం నాగంపేట తండాలో నాటుసారా తయారీకి ముడిసరకుగా వినియోగించే 50 కిలోల బెల్లం, 10 కిలోల పటికతోపాటు 5 లీటర్ల గుడుంబాను కారులో రవాణా చేస్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మాచారెడ్డికి చెందిన అజ్మీరా నాజం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, కారును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రాణాపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

రామారెడ్డి, న్యూస్‌టుడే: రాణాపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై నరేష్ శుక్రవారం తెలిపారు. రామారెడ్డికి చెందిన బిట్ల రవి గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌పై దాడికి ప్రయత్నించగా సిబ్బంది పట్టుకున్నట్లు పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బస్సులో మాయమైన రూ.4.50 లక్షలు స్వాధీనం!

కొడిపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో మాయమైన రూ.4.50లక్షల నగదును పోలీసులు వారం రోజుల్లోనే స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన మహమ్మద్ రఫీ, రెహానా బేగం దంపతులు ఈనెల 19న మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా షాపూర్ నగర్ నుంచి కామారెడ్డి డిపోనకు చెందిన బస్సులో ప్రయాణిస్తుండగా.. కొడిపల్లిలో నగదుతో కూడిన బ్యాగు మాయమైంది. ఈ విషయంలో స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిఘా కెమెరాలు, ఇతర మార్గాల ద్వారా ఆ రోజు బ్యాగుతో సహ బస్సులో నుంచి దిగిపోయిన మహిళను గుర్తించారు. వారం రోజులపాటు తీవ్రంగా శ్రమించి మహిళను పట్టుకొని.. రూ.4.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన మహిళగా గుర్తించినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డిని అడగగా నగదును స్వాధీనం చేసుకున్నామని, వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

ఇంట్లో పేలిన సిలిండర్



బాన్సువాడ గ్రామీణం: మండలంలోని సోమేశ్వర్‌లో తిమ్మప్ప కుటుంబానికి చెందిన రేకుల ఇంట్లో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలింది. ఇంట్లోని వస్తువులు, దుస్తులు, వంటపాత్రలు, బియ్యం పూర్తిగా కాలిపోయాయి. ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బాధితులు కోరారు.